క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కేజీబీవీలో విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీ మహిళలు, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో వైద్య శిబిరాలను సీహెచ్‌వో ఎస్వీ రమణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వసతిగృహాల వైద్య సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

మక్కువ: మండలంలోని సరాయివలస, చెముడు సచివాలయాలను ఎంపీడీవో ఎం.అర్జునరావు శనివారం సందర్శించారు. సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. కౌశల్ సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లందరికి వాహనమిత్ర పథకం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చెముడు సచివాలయం వద్ద పంపిణీ చేస్తున్న యూరియా, 40మంది రైతులకు చాలకపోవడంతో, శంబర పీఏసీఎస్‌కు రైతులును పంపించి యూరియా అందించేలా చర్యలు చేపట్టాలని ఏవో భారతికి ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గాదెలవలస జరిగిన ర్యాలీలో పీవో రాజ్యలక్ష్మి

సీతానగరం: మండలంలోని గాదెలవలస సెక్టార్ పరిధిలో ఉన్న గాదెలవలసలో సుపోషిత్ భారత్-సక్షం భారత్ కార్యక్రమ ర్యాలీని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో సుపోషిత్ భారత్-సక్షం భారత్ అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సూపరువైజర్లు వై.రేవతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో..

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న బోధనతో సత్ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 సామల

బలిజిపేట: పాఠశాలల్లో విద్యా బోధనలో నూతన విధానాలు అవలంబించి పిల్లలను ఆకర్షించేలా పాఠ్యాంశాల బోధన చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఎంఈవో 1 సామల సింహాచలం అన్నారు. బలిజిపేట క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్న అంశాలను అవగాహన చేసుకుని వాటి ద్వారా వనరులను సమర్థవంతంగా వినియోగించి వినూత్న పద్ధతులలో బోధనను సాగించాలని తెలిపారు. దీని వలన విద్యార్థులలో నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. అకడమిక్ క్యాలెండర్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అందరు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించి వాటిని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, రిసోర్స్ పర్సన్లు బి.వెంకటరమణ, బి.గణేష్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సాంబశివరావు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి, పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరం, వెంకంపేట తదితర గ్రామాల సమీపంలో ఉన్న కూడళ్ల వద్ద పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి తమ సిబ్బందితో కలసి శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చి పోయే వాహనాలను ఆమె సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సారా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నివారించేందుకు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. అలాగే ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా సురక్షితంగా ప్రయాణించాలని అవగాహన కల్పించారన్నారు. వాహనాల పత్రాలను పరిశీలించారు.



చెరువు గర్భంలో నిర్మాణం చేపడుతున్న ప్రజా మరుగుదొడ్లు

ఆక్రమణలో చెరువులు

- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

పాచిపెంట: చెరువులు ఆక్రమణకు గురవుతుంటే వాటి పరిరక్షణకు కట్టుబడి చట్టవిరుద్ధమైన నిర్మాణాలను అరికట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పాచిపెంట మండల కేంద్రంలో సర్వే నంబర్ 233లో పదిఎకరాల విస్తీర్ణంలో ఊర చెరువు ఉంది. ఈ చెరువు నీరుతో సుమారు 50 ఎకరాల భూమిని రైతులు సాగు చేస్తున్నారు. అలాంటి ఊర చెరువు ఇప్పటికే కొంతమేర ప్రైవేట్ వ్యక్తుల ఆక్రమణలకు గురైంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి అధికార పార్టీకి చెందిన నాయకుడు స్వచ్ఛ్ భారత్ మిషన్ కేంద్ర ప్రభుత్వ నిధులతో చెరువు గర్భంలో ఎనిమిది ప్రజామరుగుదొడ్లు, అలాగే ఆర్‌అండ్‌బీ స్థలంలో బైపాస్ రోడ్డును ఆనుకుని మరో నాలుగు మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అయితే చెరువు ఆక్రమణకు గురవుతోందని, దానిని పరిరక్షించాలని కోరుతూ స్థానిక ఎంపీటీసీ దండి ఏడుకొండలు రెవెన్యూ అధికారులకు గత నెల 15వ తేదీన ఫిర్యాదు చేసినప్పటికీ ప్రతి రోజు అటుగా వెళ్తున్న అధికారులు పనులు చూస్తున్నారే తప్ప వాటి నిలుపుదలకు చర్యలు చేపట్టకపోవడం అధికార పార్టీ నాయకుడిపై అధికారులు చూపించే స్వామి భక్తికి నిదర్శనం అంటూ చెరువు ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు స్పందించి ఆక్రమణలు అడ్డుకుని చెరువును పరిరక్షించాలని, అలాగే ప్రజావసరాలకు అనుగుణంగా వేరేచోట ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, ప్రజలు, రైతులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డును ఆనుకుని నిర్మాణంలో ప్రజా మరుగుదొడ్లు

బిల్లుల చెల్లింపుపై విమర్శలు...

ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలు చేపడుతుంటే సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఎంబుక్ రికార్డింగ్ చేసి బిల్లులు ఎలా చెల్లిస్తారు. అనేది ప్రశ్నగా మారింది. అలా బిల్లులు చెల్లిస్తే ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు కాదా? అయినప్పటికీ అధికార పార్టీ నాయకుడి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడం లేదా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రి స్పందించి చెరువును పరిరక్షించాలి



మండల కేంద్రంలో ఉన్న ఊర చెరువు ఆక్రమణకు గురవుతోందని, ఆగస్టు 15వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాను. కానీ ఈరోజు వరకు ఆ ఫిర్యాదు గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. కనీసం స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి చెరువును పరిరక్షించాలి...

– దండి ఏడుకొండలు, ఎంపీటీసీ, చెరువు ఆయకట్టు రైతు, పాచిపెంట

వినియోగంలోకి రాకముందే కనుమరుగయ్యే పరిస్థితి

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మాణం చేపడుతున్న ప్రజా మరుగుదొడ్లు వినియోగంలోకి రాకముందే కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదు. చెరువు గర్భంలో నిర్మాణం చేపట్టే ఎనిమిది ప్రజా మరుగుదొడ్లు, చెరువుకు వరద నీరు ఎక్కువగా వచ్చి చేరితే ఆ నీటిలో కలిసిపోతాయి. అలాగే ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మాణం చేపడుతున్న మరో నాలుగు ప్రజా మరుగుదొడ్లు కూడా బైపాస్ రోడ్డు వైడెనింగ్ పనులు జరిగితే తొలగించే అవకాశం ఉంది.

27న అరణ్య గర్జన

- హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి



హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, గిరిజనులు

సాలూరు: హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం హైడ్రో పవర్ ప్రాజెక్టు నాయకులు శిల్పజన్ని గోవిందరావు, శ్రీరాం, మాదల రాజు తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాచిపెంట మండలం శతాబి, తంగ్లాం, చీడివలస తదితర ప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వలన 250 గ్రామాలు మునిగిపోతాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు పాచిపెంట మండలంలో 5 పంచాయతీలు దెబ్బతినే ప్రమాదముందన్నారు. డ్రోన్ల ద్వారా సర్వే చేసి గిరిజనులకు తెలియకుండా సర్వే రాళ్లను పాతడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై గిరిజనులకు అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 22న సీలేరులో జీపు జాతర ప్రారంభమై, 27న హుకుంపేట మండలం మద్దివలసలో అరణ్యగర్జన పేరుతో వేల మంది గిరిజనులతో సభ నిర్వహిస్తామని దీనిని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వలన కాఫీ, మిరియాలు తదితర అటవీ వ్యవసాయ ఉత్పత్తులు జలసమాధి కాబోతున్నాయని, దీనిని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. గిరిజనులు చేస్తున్న న్యాయమైన పోరాటాలకు ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. దీనిపై భవిష్యత్ పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్వచ్ఛ పార్వతీపురం : కలెక్టర్



పార్వతీపురం పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి

పార్వతీపురం టౌన్ : జిల్లాలోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారుల సమష్టి కృషితోనే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యపడుతుందని కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం బెలగాంలోని చర్చి వీధిలో గల మునిసిపల్ పార్కు వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మొక్కలను నాటి, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ పార్వతీపురం ఒక్క రోజు కార్యక్రమంతో సరిపోదని, ఇది అలవాటుగా మారాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ తమ ఇంటి పరిసరాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలను పరిశుభ్రంగా ఉంచినపుడే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యం కాగలదని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, జిల్లా అధికారులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటండి : పీడీ



క్లాప్ మిత్రులను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి

పార్వతీపురం రూరల్: పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాలగడబ గ్రామంలో ఆమె పర్యటించారు. సచివాలయం పరిసరాల్లో స్థానిక మండల, పంచాయతీ అధికారులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం క్లాప్ మిత్రులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం పాడవుతుందని ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యం, వెలుగు ఏపీఎం సన్నిబాబు, స్థానిక పంచాయతీ కార్యదర్శి, పండు తదితరులు పాల్గొన్నారు. అలాగే డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు పార్వతీపురం వైకేఎం కాలనీ పంచాయతీ భాగంలో ఉన్న కార్యాలయంలో డీపీఎంలు ధర్మారావు, రామ్మోహన్, ఏపీఎం, ఆదయ్య, కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేస్తూ మొక్కలు నాటారు.

కోళ్లను మింగి చిక్కిన కొండచిలువ





మండల కేంద్రం మక్కువ సువర్ణముఖి బ్రిడ్జ్ సమీపంలోని ఓ ఫౌల్ట్రీ ఫారంలోకి శనివారం తెల్లవారుజామున పెద్ద కొండచిలువ చొరబడి మూడు కోళ్లను మింగేసింది. ఫౌల్ట్రీ ఫారం యాజమాన్యం చూసి, కొండచిలువను బయటకు తరలించారు. కోళ్లు తిన్న కొండచిలువ మండీ వేసేసింది. చాలా సమయం కదలలేక కొండచిలువ అదే ప్రదేశంలో ఉండిపోవడంతో స్థానికులు కొండచిలువను కర్రలతో హతమార్చారు. సుమారు 10 అడుగులు ఉన్న కొండచిలువను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

– మక్కువ

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు



రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగ కార్మిక సంఘాల సభ్యులు

పార్వతీపురం టౌన్: ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమ పోరాటాలు ఆగవని, ఉమ్మడి జిల్లాల విద్యుత్ ఉద్యోగ కార్మిక సంఘాల జేసీ చైర్మన్ లక్ష్మణ్ అన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రెండవ రోజు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ అభివృద్ధి కోసం రాత్రనక, పగలనక శ్రమిస్తున్న ఉద్యోగ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంస్థ కూడా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. 2023లో విద్యుత్ సంఘాలతో అప్పటి ప్రభుత్వాల్లో ఉన్న మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమక్షంలో కుదిరిన ఒప్పంద ప్రకారం యాజమాన్యం నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజినీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఉద్యోగుల సమస్యల నివారణకు పూర్వపు పద్ధతి 3 నెలలకు ఒకసారి సర్కిల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు జరిగేవని, వాటిని పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులతో నిర్వహిస్తున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ల కాంట్రాక్టును ఇవ్వడం ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా 1104 అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శ్రీధర్, 327 అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన గిరిజనులు



తాన్నవలసలో అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గిరిజన గ్రామంలో శనివారం స్థానిక పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో తదితర అధికారులు ఆదికర్మ యోగి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వెళ్లగా స్థానిక సీపీఎం నాయకుడు పాలమెట్ల రాముతో కలిసి గ్రామస్తులు నిలదీశారు. అనేకసార్లు మౌలిక సదుపాయాలు, సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇప్పించాలని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పరిష్కరించని అధికారులు ఇప్పుడు ఆదికర్మ కార్యక్రమంతో ఏం చేస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. ఆదికర్మ కార్యక్రమంలో భాగంగా 2030 నాటికి తన గ్రామాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుతారో అధికారులు గ్రామస్తులకు వివరిస్తున్నప్పటికీ అధికారుల మాటలను తోసిపుచ్చుతూ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించకుండా గ్రామస్తులంతా వెళ్లిపోయారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రాము మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు ఎప్పటికప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలు, అలాగే వారు విన్నవిస్తున్న సమస్యలు పరిష్కరించకుండా కార్యక్రమాల పేరిట ప్రభుత్వ ఆదేశాల మేరకు తూతూ మంత్రంగా నిర్వహించే కార్యక్రమాల వల్ల గిరిజనులకు వచ్చేదేమీ లేదని ఆరోపించారు. గిరిజనుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని హితవు పలికారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి



పార్వతీపురం పట్టణం నాలుగో రోడ్ల కూడలి వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: కార్మికులు, ఉద్యోగుల చట్టబద్ధ హక్కు 8 గంటల పని దినాన్ని 13 గంటలుగా మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బివి.రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారంనిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, అందులో భాగంగానే శుక్రవారం అసెంబ్లీలో 8 గంటల పని దినాన్ని 13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యోగం వర్గాలు పోరాడుతాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయ్యాయి అనటానికి ఇదే ఉదాహరణ అని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని దినంగా మారుస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బి.సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు మండంగి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కౌలు చట్టం తీసుకురావాలి



అంపావల్లిలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నూతన కౌలు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20వేలు వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవు సాంబమూర్తి, రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 22న చలో అసెంబ్లీ కార్యక్రమానికి రైతులు రావాలని కోరుతూ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతుల పట్ల ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పాత చట్టంలో లోపాలను సవరించి కొత్త చట్టం చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పటికీ ఏమి చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పిన నాయకులు దానిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. వీటిని అమలు పరచాలని చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎస్పీ



జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసు శాఖ ఉన్నతాధికారులు

పార్వతీపురం రూరల్:

ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లతో పాటు జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎస్పీ కార్యాలయంలో పరిసరాలను స్వయంగా పోలీసు శాఖ ఉన్నతాధికారులే శ్రమదానం చేసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేయాలన్నారు. తద్వారా వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునన్నారు.

విశ్వశాంతి హోమం



విశ్వశాంతి హోమంలో పాల్గొన్న కార్పెంటరీ వర్కర్స్ యూనియన్ సభ్యులు

పార్వతీపురం టౌన్:

పట్టణంలోని జగన్నాధపురం నాయుడు వీధిలో విశ్వకర్మ జయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీ పార్వతీదేవి కార్పెంటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలతో పాటు ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని, సుఖ సంతోషాలతో విశ్వశాంతి హోమం జరిగింది. ఉదయం 9 గంటల నుంచి కార్పెంటరీ వర్కర్స్ యూనియన్ నాయకులు జవ్వాది వెంకటరమణ నిర్వహణలో విశ్వకర్మ భగవానునికి అభిషేకాలు, సహస్రనామార్చనలు, షోడోపచార పూజలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి ఉత్సవ మండపం వద్ద మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి విశ్వకర్మ భగవానుని అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

తాగునీరు వృథా!



బలిజిపేట ఎస్సీ కాలనీలో ఓహెచ్‌ఆర్ నుంచి కారుతున్న తాగునీరు

బలిజిపేట: బలిజిపేట ఎస్సీ కాలనీలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తాగునీరు నిరుపయోగంగా బయటకు పోతున్నా దానిని నియంత్రించేవారు కరువయ్యారు. కొన్ని గ్రామాలకు తాగునీరు అందక కటకటలాడుతుంటే మరికొన్ని చోట్ల వృథా కావడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. వెంగళరాయపురం రక్షిత మంచినీటి పథకం నుంచి నీటిని చిలకలపల్లి పంప్‌హౌస్‌కు ఎక్కించి అక్కడ నుంచి బలిజిపేట, పలగర, తదితర గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ సమయంలో బలిజిపేట ఎస్సీ కాలనీ ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కించే సిబ్బంది నిర్లక్ష్యం వలన నీరు వృథాగా పోతుందని పలువురు చెబుతున్నారు. ఆపరేటర్లు నీటిని సక్రమంగా అందించకపోవడంతో గ్రామాల్లో దాహం కేకలు ఎక్కువగా ఉంటున్నాయంటున్నారు. అధికారులు స్పందించి తాగునీరు దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.